సాక్షి రంగారెడ్డి

శనివారం । 2 । ఆగస్టు । 2025



విద్యారంగ బలోపేతం..

ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు అన్నారు. 8లో▶



పర్మిషన్ ఇవ్వండి

కష్టపడి కొనుక్కున్న ప్లాట్లపై విధించిన స్టేటస్‌కో తొలగించి, ఇల్లు కట్టుకునేందుకు అనుమతివ్వాలని బాధితులు కోరారు. 8లో▶



నూనెగింజల సాగుతో..

నూనె గింజల సాగుతో అధిక దిగుబడి.. లాభాలు పొందొచ్చని నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ అన్నారు. 8లో▶

న్యూస్‌రీల్

నేడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

యాచారం: కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి శనివారం మండలానికి రానున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా శాస్త్రవేత్త శ్రీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారాణాసిలో పీఎం కిసాన్ 20వ విడత నిధులు విడుదల చేస్తున్న సందర్భంగా యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగే కార్యక్రమంలో వీడియో ప్రసంగం వీక్షించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొంటారని తెలిపారు.

సింగంపల్లి కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

ఆమనగల్లు: మండల పరిధిలోని సింగంపల్లి గ్రామ కార్యదర్శి పి.జంగయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సింగంపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన కొత్తకుంటతండా కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సరిగా విధులకు హాజరు కావడం లేదని, సమస్యలను దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు కొద్దిరోజులుగా పేర్కొంటున్నారు. ఈ మేరకు ఆయనను బదిలీ చేయాలని లేదంటే చర్యలు తీసుకోవాలని మే 27న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తరువాత మంత్రి సీతక్కకు సైతం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతిరోజు ప్రభుత్వ యాప్‌లో డీఎస్‌ఆర్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జంగయ్య నకిలీ డీఎస్‌ఆర్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు రాష్ట్ర అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు యాప్‌లో నకిలీ డీఆర్‌ఎస్‌ను అప్‌లోడ్ చేసినందుకుగాను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాలువను పరిశీలించిన హైడ్రా కమిషనర్



వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కేంద్రంలోని పెద్ద బావి మల్లారెడ్డి ఫంక్షన్ హాలు వద్ద మెయిన్ రోడ్డు మీదుగా వెళ్తున్న వరద నీటి కాలువను శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. నెల క్రితం ఇదే కాలువను పరిశీలించి వరదనీరు, మురుగునీరు సాఫీగా వెళ్లేలా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి తన బృందంతో కలిసి వచ్చి పర్యవేక్షించారు. నాలా పనులు పక్షం రోజుల్లో మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఆన్‌లైన్ సేవల్లో ఆటంకం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. స్టేట్ డాటా సెంటర్లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా వాటర్ బోర్డు ఆన్‌లైన్‌లో సేవలు నిలిచిపోయాయి. వాటర్ ట్యాంకర్ బుకింగ్.. డెలివరీ, ఎంసీసీ ఫిర్యాదుల అంశాల్లో రెండురోజులుగా ప్రజలకు అసౌకర్యం కలుగుతుండటంతో జలమండలి ఎమర్జెన్సీ కాంటిజెంట్ ప్రణాళిక అమలు సిద్ధమైంది. శుక్రవారం జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి ఎండీ అశోక్ రెడ్డి, డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి తాజా పరిస్థితులను సమీక్షించారు. ట్యాంకర్ బుకింగ్ మ్యానువల్‌గా స్వీకరించి ట్యాంకర్ సరఫరా చేయాలని, దానికి సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

వాట్సాప్ గ్రూప్ ద్వారా ఫిర్యాదులు

ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడటంతో మెట్రో కస్టమర్ కేర్ కాల్ సెంటర్ (ఎంసీసీ)కి వచ్చే ఫిర్యాదుల కోసం జలమండలి ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసింది. సెక్షన్ల వారీగా వాట్సాప్ గ్రూప్స్‌లకు వచ్చే కలుషిత నీరు, సీవరేజ్ ఓవర్ ఫ్లో, ఇతరత్రా ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. వాటర్ ట్యాంకర్ల బుకింగ్ శుక్రవారం మ్యానువల్ పద్ధతిలో కొనసాగింది. ఆన్‌లైన్ సేవల అంతరాయం కారణంగా వినియోగదారులు ట్యాంకర్ బుకింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని గుర్తించి జలమండలి మ్యాన్‌వల్ పద్ధతిలో ట్యాంకర్ల బుకింగ్‌కు వెసులు బాటు కల్పించింది. ఆన్‌లైన్ సేవలు పునరుద్ధరణ జరిగే వరకు ఫిర్యాదులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.

ఆ భూములెక్కడ?

భూదాన్ భూములపై ఆరా

- హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి రెవెన్యూ యంత్రాంగం
- మెజార్టీ ఎకరాలు అన్యాక్రాంతం
- ఉమ్మడి జిల్లాలో సేకరించింది: 21,939 ఎకరాలు
- ప్రస్తుతం మిగిలింది: 304.54 ఎకరాలు
- కోర్టుకు ఏం చెప్పాలో తెలియక ఆందోళనలో అధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూదాన్ భూముల అన్యాక్రాంతంపై అధికారులు ఆరా తీస్తున్నారు. గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి .. క్షేత్రస్థాయిలో కన్పిస్తున్న విస్తీర్ణానికి పొంతన లేకపోవడంతో తలపట్టుకుంటున్నారు. మహేశ్వరం మండలం నాగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 181,182, 194,195లోని భూదాన భూముల వివాదం హైకోర్టులో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన కొంత మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కలిసి ఈ భూములను కొల్లగొట్టడం, ఇదే అంశంపై హైకోర్టులో విచారణ కొనసాగుతుండటం, చివరికి భూదాన్ భూములు ఎక్కడ.. ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో స్పష్టం చేయాలంటూ రెవెన్యూ యంత్రాంగానికి న్యాయస్థానం ఇటీవల ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారులు ఆయా భూములను వెతికే పనిలో నిమగ్నమయ్యారు. పేదలకు పంచగా, మిగిలిన మెజార్టీ భూములు ఇప్పటికే అన్యాక్రాంతం అయినట్లు తెలిసి కోర్టుకు ఏం సమాధానం చెప్పాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

చివరికి మిగిలింది 304 ఎకరాలే..

1951 ఏప్రిల్ 18న వెదిరె రామచంద్రారెడ్డి మొదటి భూదానంతో భూదానోద్యమం పుట్టగా 1956లో భూదాన్ యాక్ట్ అమల్లోకి వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు లక్ష ఎకరాలు పోగైంది. హైదరాబాద్ జిల్లాలో 14 మంది దాతల నుంచి 414.74 ఎకరాల భూమిని సేకరించగా, ప్రస్తుతం సెంటు భూమి కూడా లేకుండా పోయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1,682 మంది దాతల నుంచి 21,939.17 ఎకరాల భూమిని సేకరించారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞబోర్డు ఆధ్వర్యంలో 13,574 మంది పేదలకు భూములను పంచారు. అర్హులైన పేదలకు 60, 100, 120 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. సాగులో ఉన్న భూమి అయితే రెండు ఎకరాలు, మెట్ట భూమి అయితే ఐదు ఎకరాల చొప్పున అందజేశారు. ప్రస్తుతం జిల్లాలో 304.54 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఉమ్మడి జిల్లాలోని 37 మండలాల్లో ఉన్న భూదాన్ భూములన్నింటికీ ఖాస్రా పహాణీలు ఉన్నాయి. 1980 తర్వాత రియల్ ఎస్టేట్ రంగం విస్తరించడం, భూదాన్ భూముల రక్షణకు సరైన వ్యవస్థ లేకపోవడంతో ఆయా భూములకు రక్షణ లేకుండా పోయింది. అప్పటి కలెక్టర్ శేషాద్రి సహా జాయింట్ కలెక్టర్ రిజ్వీ మరో పదిమంది అధికారులతో అప్పట్లోనే ఆయా భూములను కంప్యూటీకరించారు. ఆయా రికార్డులను రెవెన్యూ రికార్డులతో సరి చూసి జీఓ జారీ చేశారు. భూదాన్ బోర్డుకు పటిష్టమైన రక్షణ వ్యవస్థ లేకపోవడంతో మెజార్టీ భూములు అన్యాక్రాంతమయ్యాయి.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి..

- గండిపేట మండలం వట్టినాగులపల్లి సర్వే నంబర్లు 186,187,188,189లోని 29.26 ఎకరాల భూదాన్ భూమి ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది.
- యాచారం మండలం తాడిపర్తి సర్వే నంబర్ 104లోని 250 ఎకరాల భూదాన్ భూమి ఉంది. దాతలు ఇచ్చిన ఈ భూములను కొంతమంది పెద్దలు కొల్లగొట్టారు. ఆ తర్వాత అవే భూములను ఫార్మాసిటీ భూసేకరణ పేరుతో ప్రభుత్వానికి కట్టబెట్టి కోట్ల రూపాయల మేర లబ్ధి పొందారు.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ సర్వే నంబర్17లోని 60 ఎకరాలు మాయమైంది.
- తారామతిపేట సర్వే నంబర్ 215,216,217లో 59.10 ఎకరాల భూదాన్ భూమి మాయమైంది.
- కుంట్లూరు సమీపంలోని పాపాయిగూడ సర్వే నంబర్ 219, 224లోని 82.39 ఎకరాలు, సర్వే నంబర్ 215, 224లోని వంద ఎకరాలు మాయమైంది.
- మహేశ్వరం మండలం మంఖాల్ సర్వే నంబర్ 435లోని 12.17 ఎకరాల భూదాన్ భూమిని పక్కనే ఉన్న పట్టా భూముల్లో కలిపేశారు.
- ఆదిబట్ల సర్వే నంబర్ 51, 52, 53లోని సుమారు 30 ఎకరాలతో పాటు కూకట్‌పల్లి సర్వే నంబర్ 353, 354,లోని 24.20 ఎకరాలు, బాటసింగారం సర్వే నంబర్ 319లోని 13.35 ఎకరాలు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి.

ఒక్కో చోట ఒక్కోలా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అప్పటి వరకు ఉన్న భూదాన యజ్ఞబోర్డు రద్దు చేయడం, ఆయా భూముల రికార్డులను సీసీఎల్‌ఏకు అప్పగించడం, భూదాన్‌బోర్డులోని రికార్డుల్లో ఒకలా.. రెవెన్యూ రికార్డుల్లో మరోలా వివరాలు ఉండటం, ధరణి పోర్టల్ రాకతో అనేక సర్వే నంబర్లు మాయమైపోవడం, వాటికి కొత్తగా బై నంబర్లు పుట్టుకరావడాన్ని చూసి అంతా విస్తుపోతున్నారు. ఆయా భూములు ఎక్కడున్నాయో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి



యాచారం: మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

యాచారం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నేతలు అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు విన్నవించారు. శుక్రవారం పరిగిలో జనహిత పాద యాత్రలో ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫార్మాసిటీని రద్దు చేయకుండా మళ్లీ బలవంతంగా భూములు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పులున్నా అధికారులు లెక్కచేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఎన్నికల హామీ ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసి, ఆ భూములను తిరిగి రైతులకు ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి నేతలు కవుల సరస్వతి, నారాయణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయండి

మొయినాబాద్: ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఉద్యమకారులు విన్నవించారు. పరిగిలో జనహిత పాదయాత్ర చేపడుతున్న వారిని శుక్రవారం మండలానికి చెందిన ఉద్యమకారులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటిస్థలం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని.. వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో మహిపాల్, విష్ణువర్ధన్, నర్సింహ్మగౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు సీపీఐ జిల్లా మహాసభలు



ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం నాయకులు

ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

మొయినాబాద్: సీపీఐ జిల్లా 17వ మహాసభలు శనివారం మున్సిపల్ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో సభలు ప్రారంభం కానున్నాయి. జిల్లా నలుమూలల నుంచి 400 మంది ప్రతినిధులు రానున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభా పక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరసింహ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పర్వతాలు పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, నాయకులు సుధాకర్‌గౌడ్, సత్తిరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

సర్వే చేశాకే ఫెన్సింగ్ వేయండి



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

రెండోరోజు పనులను అడ్డుకున్న రైతులు

కందుకూరు: తమ భూమి తమకు సర్వే చేసి చూపిన తర్వాతే ఫెన్సింగ్ వేసుకోవాలని మండల పరిధిలోని దెబ్బడగూడ రైతులు తేల్చిచెప్పారు. ఫార్మాసిటీ కోసం గతంలో పరిహారం చెల్లించిన ముచ్చర్ల రెవెన్యూలోని భూములకు అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకీరెడ్డి, సీఐ సీతారామ్, తహసీల్దార్ గోపాల్ పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది శుక్రవారం రెండో రోజు ఫెన్సింగ్ పనులు చేపట్టారు. ముచ్చర్ల, దెబ్బడగూడ, కందుకూరు శివారులో భూమి విషయమై రైతులు, అధికారుల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. ముచ్చర్ల రెవెన్యూలోని సర్వే నంబర్ 123 చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెబుతుండగా, దెబ్బడగూడ రెవెన్యూలోని సర్వే నంబర్ 31లో కొంత భాగం, కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 323లోని కొంత భాగం తమ భూములు కలుపుకొని ఫెన్సింగ్ వేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ సర్వే నంబర్లు సర్వే చేసి చూపాలని అప్పటి వరకు ఫెన్సింగ్ వేయనీయమని భీష్మించారు. వీరికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిట్టా రాజేందర్‌రెడ్డి, లక్ష్మణ్, అమరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు మద్దతు పలికారు. మరోవైపు ఎమ్మెల్యే సబితారెడ్డి సైతం అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అన్నివైపుల నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు సర్వే చేసిన తర్వాతే ఫెన్సింగ్ వేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే అఖిల భారత మత్స్యకారుల మత్స్య కార్మిక సమాఖ్య 4వ మహాసభలను విజయవంతం చేయాలని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ పిలుపునిచ్చారు. ఆ మహాసభల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత్స్యకారుల హక్కులను కాలరాస్తోందని, సంక్షేమ పథకాలను ఎత్తివేస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగా ఎన్‌సీడీసీ, ఎన్‌ఎఫ్‌డీబీ స్కీమ్‌లను రద్దు చేసిందని తెలిపారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చనమోని శంకర్, సీహెచ్ వెంకన్న, పాకరాం చందర్, బొద్రమోని నర్సింహ, కాగు లక్ష్మి, సువర్ణ, నగేశ్, పూల యాదయ్య, శివశంకర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

హక్కుల సాధనకు పోరాడుదాం

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: హక్కుల సాధనకోసం మాలలు ఏకతాటిపైకి రావాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మాలల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సలహాలు, సూచనలు చేయడం సరి కాదని అన్నారు. ఎస్సీ ఉపవర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ త్యాగాల, పోరాట ఫలితంగా వచ్చిన రిజర్వేషన్లను మాలలకు దూరం చేయడం తగదన్నారు. మాలలు హక్కులను సాధించే వరకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, నర్సింహ, శేఖర్, కుమార్, మల్లేష్, అశోక్, దయాకర్, శ్రీనివాస్, రమేష్, క్రాంతి పాల్గొన్నారు.

పింఛన్ పెంచి అమలు చేయాలి



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ

చేవెళ్ల: ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ దారులకు వెంటనే పింఛన్ పెంచి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. చేవెళ్లలోని శ్రీవెంకటేశ్వరగార్డెన్‌లో శనివారం జరగనున్న పెన్షన్‌దారుల సభా ఏర్పాట్లను శుక్రవారం ఆయన ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి ఎం.యాదగిరి, జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహ, కె.శంకర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, చేయూత పెన్షన్‌ను రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. చేవెళ్లలో శనివారం నిర్వహించే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సభకు పెన్షన్‌దారులు, అర్హులైనా పెన్షన్‌రాని వారు, వికలాంగులు, వృద్ధులు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాడిగళ్ల ప్రవీణ్, బి. శివశంకర్, నాని భానుప్రసాద్, శ్రీనివాస్, మహేందర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఆమనగల్లులో మొక్క నాటుతున్న సీడీఎంఏ జేడీ సంధ్య

సీడీఎంఏ జెడీ సంధ్య

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య కోరారు. మున్సిపల్ పరిధిలో అమృత్ పథకంలో భాగంగా రూ.32 కోట్లతో నిర్మించే పైప్‌లైన్, వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణానికి స్థలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రైతువేదిక భవనం వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శంకర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తోందని తెలిపారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ తిరుపతిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది శ్రీనివాసులు, ఎల్లయ్య, రమేశ్, షర్ఫుద్దీన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే అధికారం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- పరిగి గిరిజన గురుకులంలో శ్రమదానం
- పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్



గిరిజన బాలికల వసతి గృహంలో శ్రమదానం చేస్తున్న మీనాక్షి నటరాజన్, పార్టీ శ్రేణులు

పరిగి/దోమ: కార్యకర్తల కృషి, శ్రమతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శుక్రవారం పరిగి పట్టణ పరిధిలోని గిరిజన బాలికల పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి శ్రమదానం చేశారు. జనహిత పాదయాత్రలో భాగంగా మీనాక్షి నటరాజన్ గురువారం సాయంత్రం పరిగికి చేరుకున్నారు. రాత్రి స్థానిక ఎస్ గార్డెన్‌లో బస చేశారు. ఉదయం బాలికల పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఎస్‌గార్డెన్ చేరుకొని రాట్నం తిప్పుతూ దారం తయారీని కార్యకర్తలకు చూపించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీని గుర్తు చేసుకున్నారు. గాంధీ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు.

స్థానిక సంస్థల్లో సత్తాచాటాలి

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సత్తా చాటాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎస్ గార్డెన్‌లో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో పార్టీ పటిష్టంగా ఉండాలంటే నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. బేదాభిప్రాయాలు లేకుండా అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. కార్యకర్తల సేవలకు గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, ఎమ్మెల్యేలు పర్నికారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, యాదయ్య, బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి ఇక్క ఇల్లు కూడా కట్టించలేదన్నారు.

అభిషేక్‌ను కలిసిన యాదిరెడ్డి



అభిషేక్ మను సింఘ్వీతో యాదిరెడ్డి తదితరులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ జాతీయ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీని.. చేవెళ్లకు చెందిన పీసీసీ లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు న్యాయవాది బి.యాదిరెడ్డి శుక్రవారం సుప్రీం కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ, లీగల్‌సెల్ విభాగం పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించామని యాదిరెడ్డి తెలిపారు. జాతీయ ఏఐసీసీ లీగల్‌సెల్ కార్యవర్గ సమావేశంలో దీనిపై చర్చించనున్నామని ఆయన పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు: కందుకూరు మండలం నేదునూరు మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లను ఆహ్వానించామని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 8 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఈసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉండి అర్హత గల విద్యార్థులు, ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటల వరకు సర్టిఫికెట్లతో పాఠశాలకు రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ చాపల బాల్‌రాజ్ తండ్రి లేట్ చాపల జంగయ్య, నివాసం: ఇం.నం.1-86, నాగారం గ్రామం, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా గారు రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, నాగారం గ్రామం వద్ద గల ఎ.0.20 గుంటల విస్తీర్ణపు సర్వే నం.23/AA1/Aలోని వ్యవసాయ భూమికి సంబంధించి యజమాని కుండె వెంకటేష్ తండ్రి నర్సింహ, నివాసం: ఇం.నం.1-36, నాగారం గ్రామం, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా గారితో 30-07-2025 తేదీన విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అట్టి ఆస్తిని విలువగల ప్రతిఫలానికి నా క్లయింట్ కొనుగోలు చేస్తున్నారు మరియు నా క్లయింట్ విక్రయ వ్యవహారంతో తదుపరి ముందుకు సాగేందుకు ఉద్దేశిస్తున్నారు.

కావున, ఎవరైనా వ్యక్తి లేదా ఎంటిటీ సదరు ఆస్తికి సంబంధించి ఏదైనా క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం, అభ్యంతరం లేదా తాకట్టు రుణభారం కలిగి ఉంటే, వారు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **7 (ఏడు) రోజుల్లోగా** సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారు న్యాయవాదిని సంప్రదించాలని ఇందుమూలంగా కోరడమైనది.

ఒకవేళ నిర్ణీత కాలంలోగా ఎటువంటి అభ్యంతరం అందనట్లయితే, ఎటువంటి క్లెయిమ్ లేదా అభ్యంతరం లేదని భావించబడుతుంది మరియు తదుపరి తదనుగుణంగా వ్యవహారము పూర్తి చేసుకోబడుతుంది.

సం/- **బీర్ల రాఘవేంద్ర**, న్యాయవాది
నివాసం: ఇం.నం. 1-1/10/6/3,
బృందావన్ టౌన్‌షిప్, ఓల్డ్ పి.ఎస్. రోడ్,
శంషాబాద్ మున్సిపాలిటీ మరియు మండలం,
రంగారెడ్డి జిల్లా. సెల్: 9948886002.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలం వాస్‌దేవ్‌పూర్ గ్రామం చెన్నారంతండాకు చెందిన కేతావత్ దేశ్యా(46) గురువారం రాత్రి పదకొండున్నర గంటలకు కడ్తాల్ నుంచి గుర్లకుంటతండాకు వెళ్లేందుకు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కల్వకుర్తి వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం దేశ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నూనె గింజల సాగుతో రాబడి

షాబాద్: నూనె గింజల సాగుతో అధిక దిగుబడి సాధించడంతో పాటు.. లాభాలు అదే విధంగా పొందవచ్చని నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆర్.కె.మాథుర్, కావేరి అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రవీణ్ రావు అన్నారు. శుక్రవారం భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్‌లో 49వ ఫౌండేషన్ దినోత్సవం సందర్భంగా సాగుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గింజల సాగుతో అధిక దిగుబడి సాధించిన తిర్మలాపూర్, మల్లారెడ్డిగూడ రైతులు సుగుణమ్మ, నర్సమ్మ, మాణిక్యంలను సన్మానించారు. అనంతరం సంస్థ నుంచి అధిక దిగుబడి ఇచ్చే కుసుమ రకాలు, ఆదాయ మార్గాల గురించి వివరించారు.



రైతులను సన్మానించిన డైరెక్టర్ మాథుర్ తదితరులు

కార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, తిర్మలాపూర్, మల్లారెడ్డిగూడ, మిట్టకంకల్ రైతులు శ్రీనివాస్, మాణిక్యం, సుగుణమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి

నందిగామ: ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రం నందిగామ, మామిడిపల్లి, మేకగూడ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ.. రెండేళ్లు గడిచినా నివేదిక వెల్లడించలేదని ఆరోపించారు. వెంటనే నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్‌ను అమలు చేయాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, జీపీఎస్‌లోన్లు, పార్ట్ ఫైనల్, టీజీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, సరెండర్ లీవ్స్ తదితర బిల్లులను విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి, హరిహోమ్, కొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, సంఘం సభ్యులు కిష్టారెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకటేశ్, జంగయ్య, సోము భూపాల్‌రెడ్డి, ఆనందం తదితరులు ఉన్నారు.

అక్రమార్కులపై కొరడా

- పెద్దేముల్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు
- ఎర్రరాయి తరలిస్తున్న వాహనాల పట్టివేత
- ఏడుగురిపై కేసు నమోదు



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

తాండూరు రూరల్: ఎర్రరాయి తరలిస్తున్న అక్రమార్కులపై అధికారులు కొరడా ఝళిపించారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి, పాషాపూర్ తండా పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాలపై శుక్రవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇద్దరు జేసీబీ డ్రైవర్లు, ఐదుగురు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. సీఐ కథనం ప్రకారం.. పెద్దేముల్ మండలం అడికిచెర్ల, పాషాపూర్ తండా సమీపంలోని ప్రభుత్వ భూముల్లో కొందరు ఎర్రమట్టి రాయిని తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి రాయిని ట్రాక్టర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నారు. ఇందులో జేసీబీ డ్రైవర్లు మన్నె ప్రవీణ్, రాథోడ్, ట్రాక్టర్ డ్రైవర్లు రాథోడ్ మోహన్, పెద్దేముల్ రవి, తల్వార్ శరణ్, చించోళి సుభాష్, మూర్తిలపై పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రెండు జేసీబీ, ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో

ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిరాయి అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల తండాకు చెందిన ఓ గ్రామస్థాయి మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్ల సహాయంతో కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎర్రరాయి తవ్వకాల అక్రమార్కులపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించడంతో తట్టెపల్లి, పాషాపూర్‌తండాలో కలకలం రేగింది.

మహిళా రైతుపై కేసు నమోదు

బషీరాబాద్: మండలంలోని మైల్వార్ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతివనంలో చెట్లు నరికి సాగు చేస్తున్నారని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుతో మహిళా రైతుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెతుకు బసమ్మ అనే రైతు గ్రామ సమీపంలోని సర్వేనంబర్ 235లో 10 ఎకరాల భూమిలో సాగుకోసం చిన్నిచిన్న చెట్లను తొలగించింది. అయితే భూమి గ్రామ పంచాయతీకి చెందిందని గ్రామ కార్యదర్శి బాయికాడి నర్సిములుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ తిరుమల స్వామి, రెవెన్యూ అధికారులు కూడా సదరు భూమి పంచాయతీకి చెందిన ప్రకృతివనమేనని తేల్చారు. విచారణ జరిపిన ఎస్ఐ బసమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇళ్ల నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వండి



ధర్నా చేస్తున్న వెంచర్ బాధితులు

షాద్‌నగర్‌రూరల్: కష్టపడి కొనుక్కున్న ప్లాట్లపై విధించిన స్టేటస్కోను తొలగించి, ఇల్లు కట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని రెడ్‌హిల్స్ వెంచర్ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వెంచర్ ఎదుట ధర్నాచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ ప్లాట్లను యంత్రాల సహాయంతో చదును చేశారని, ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా అప్పట్లో కొందరిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతంలో ప్రతివాదులు కోర్టులో వేసిన కేసులు వీగిపోయాయని, మరో కేసువేసి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిని అడ్డుగా పెట్టుకొని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఏకపక్షంగా వ్యవహరించి, నిర్మాణాలు చేపట్టకుండా స్టేటస్కో విధించారని పేర్కొన్నారు. దానిని తొలగించి, ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు బాలరాజ్, వీరయ్య, రమేష్, జంగమ్మ, మల్లమ్మ, కృష్ణయ్య, నర్సింహులు, పుష్పమ్మ, గోపాల్, చంద్రశేఖర్, మహేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ బలోపేతం ఎస్టీఎఫ్ఐ లక్ష్యం



ఎస్టీఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) లక్ష్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఫెడరేషన్ సీనియర్ నాయకుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎస్టీఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో భావసారూప్యత కలిగిన 25 సంఘాల టీచర్స్ యూనియన్లతో 2000 సంవత్సరంలో ఎస్టీఎఫ్ఐ ఏర్పడిందని తెలిపారు. విద్యారంగంలో శాస్త్రీయ విధానాలను అనుసరించడం, సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా ప్రస్తుతం ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వాటిని తగ్గించి రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను కాపాడాలని సూచించారు. దేశవ్యాప్తంగా పాఠశాల విద్యకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రం తెచ్చిన ఎన్‌పీఎస్, సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఈపీ 2020 విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలనే లక్ష్యంతో ఈ నెల 8న కలకత్తాలో రజతోత్సవ సభలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు సత్యం, లక్ష్మీ దేవమ్మ, రామకృష్ణ, వినీత్‌గౌడ్, శివ, రాజు, జేవీవీ నాయకులు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుకోమన్నందుకు.. తనువు చాలించాడు

చేవెళ్ల: మంచిగా చదువుకోవాలని మందలించినందుకు డిగ్రీ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో పరిధి ఆలూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన ఎరుకల మహిపాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలూరులో నివసిస్తున్నాడు. టైలర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్న కుమారుడు విజయ్‌కుమార్(20)ను డిగ్రీ విద్యనభ్యసించేందుకు వికారాబాద్ లోని ఎస్ఏపీ కళాశాలలో చేర్పించారు. చదువుపై ఇష్టంలేని యువకుడు.. కళాశాలకు వెళ్లక పోవటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన విజయ్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడి, తనువు చాలించాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నర్సింహులు(ఫైల్)

షాబాద్: రోడ్డు ప్రమాదంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. షాబాద్ సీఐ కాంతాం రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాచన్‌పల్లికి చెందిన ఎఫ్ఏ కోళ్ల నర్సింహులు (45) షాబాద్‌లోని ఉపాధి హామీ కార్యాలయంలో విధులు ముగించుకొని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. తెలంగాణ మోడల్ స్కూల్ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేరళ నర్సుల అరెస్టు అనైతికం

సాక్షి, సిటీ బ్యూరో: మతమార్పిడి, మనుషుల అక్రమ రవాణా పేరుతో కేరళకు చెందిన ఇద్దరు నర్సులను అరెస్టు చేయడం దారుణమని అఖిల భారత బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త పూర్ణచందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ దళిత, ఆదివాసీ, మైనార్టీ, అణగారిన వర్గాలకు తోడుగా నిలుస్తున్న వారిని లక్ష్యంగా చేసుకోవడం దారుణమన్నారు. బహుజన సమాజ్ శాంతి, సేవ, సమానత్వం కోసం పోరాడిందని తెలిపారు. మతం పేరుతో చీలికలు తేవడం కాదని, న్యాయం కోసం నిలబడాలని ఆయన కోరారు.